క్లుప్తంగా

నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళం



దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఒక భక్తుడు గురువారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఏలూరుకు చెందిన మద్దుల శ్రీనివాస్ ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. దాతకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

శ్రీవారి సేవలో...



శ్రీవారి క్షేత్రంలో సినీ నటుడు నాగినీడు

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రాన్ని ప్రముఖ సినీ నటుడు వెల్లంకి నాగినీడు గురువారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు. పలువురు భక్తులు ఆయనతో ఫొటోలు దిగారు.

చండీహోమం



ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక విజయదుర్గమ్మ ఆలయంలో చండీహోమం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ ఈమని శశికుమార్ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ సుదర్శనం వేణుగోపాల చార్యులు, వేద పండితులు సత్య కిరణ్ చండీహోమం జరిపారు. తంబెళ్ళ రామ్, పామర్తి వెంకటేశ్వరరావు దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమాలను ఆలయ శాశ్వత కమిటీ అధ్యక్షుడు మారిశెట్టి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మాడా రామ్మోహనరావు పర్యవేక్షించారు.

ఆర్థిక సహాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న లయన్స్ సభ్యులు

చింతలపూడి: లయన్స్‌క్లబ్ అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గద్దమడుగుల రాజేష్‌నాయుడు సూచించారు. స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం చింతలపూడి పట్టణానికి చెందిన కొనకళ్ళ రమాదేవి అనే మహిళకు కంటి ఆపరేషన్ నిమిత్తం రూ.15 వేలు ఆర్థిక సాయం అందచేశారు. క్లబ్ కార్యదర్శి కొత్తపూడి శేషగిరిరావు, ఖాజా మొయినుద్దీన్, వాసిరెడ్డి శ్రీనివాస్, చిల్లపల్లి మోహన్‌రావు, చిక్కాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్



రేగులపాడులో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ నందిని

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల అటవీ ప్రాంతంలో ఉన్న కొండరెడ్డి గ్రామాలైన రేగులపాడు, రేపల్లె, డోలుగండి గ్రామాల్లో గురువారం దొరమామిడి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు అందించారు. డాక్టర్ నందిని, వైద్య సిబ్బంది ఆయా గ్రామాల్లో గిరిజనులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అదే విధంగా ఇంటింటికీ తిరిగి గిరిజనుల ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు.

గిరిపుత్రుల సంప్రదాయాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిపుత్రుల సంస్కృతి సాంప్రదాయాలు పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీఓ ఎం. సూర్యతేజ అన్నారు. మారుమూల ప్రాంతమైన మెరకగూడెం గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ గ్రామంలో ఆడమరాజు గద్దెను పీఓ సందర్శించారు. ప్రధాన పూజారి సోదెం బొజ్జి మూడు రోజులపాటు గద్దె వద్ద గిరిజనులు ప్రత్యేక పూజలు చేస్తారని పీఓకు చెప్పారు. భక్తుల సౌకర్యార్థం బోరు, కరెంట్, షెడ్, వంట సామగ్రి, గుడి ఏర్పాటు చేయాలని కరకాడవడ్డీ సోదెం సుధాకర్ తదితరులు కోరారు. కార్యక్రమంలో వెలుగు ఏపీడీ నాగేశ్వరరావు, డీవైఈఓ కలుం నీలయ్య, ఏఎంఓ శిరమయ్య, సోదెం ఆడమరాజు, గాలి దుర్గారావు, సర్పంచ్ సోదెం గంగాదేవి, తదితరులు పాల్గొన్నారు.

అమరజీవిని స్మరించుకోవాలి

జంగారెడ్డిగూడెం: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని రాష్ట్రవ్యాప్తంగా కుల, మత, వర్గాలకు అతీతంగా జరుపుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ (సీహెచ్ఆర్) గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములుకు తగిన గౌరవం ఇస్తూ రాజధానిలో స్మృతి వనం ఏర్పాటు చేసి, ఆయన విగ్రహాన్ని ప్రతిష్ట చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

నవరత్నాలతో పేదల ఆర్థిక స్థితి మెరుగు

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- వేలేరుపాడు మండలంలో గడపగడపకు మన ప్రభుత్వం



ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

వేలేరుపాడు: పేదల ఆర్థిక స్థితి మెరుగుపరిచేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. వేలేరుపాడు మండలం, తట్కూరి గొమ్ము-2 సచివాలయం, కటుకూరు సచివాలయం, తిరుమలపురం సచివాలయల పరిధిలో గురువారం గడపగడపకు మన ప్రభుతం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల కాలంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. అన్ని సామాజిక వర్గాలకు న్యాయం సీఎం జగన్‌తోనే సాధ్యమని ఉద్ఘాటించారు. మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలే కాకుండా, చెప్పని వాటిని సైతం అమలుచేశారని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఏకైక వ్యక్తి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు. పింఛన్లు, డ్వాక్రా మహిళలకు ఇచ్చే వడ్డీ రాయితీ, రైతు భరోసా, పంట రుణాలపై వడ్డీ మాఫీ, అమ్మఒడి, మత్స్యకారులకు, నాయీ బ్రాహ్మణులకు, రజకులకు, నేతన్నలకు, వాహన మిత్ర పేరుతో ఆటో టాక్సీ డ్రైవర్లకు, ఇలా అన్ని రకాల వర్గాలకు మేలు చేస్తున్నారని బాలరాజు చెప్పారు. తొలుత తట్కూరి గొమ్ము సచివాలయం-2 పరిధిలో కొర్రాజులగూడెం, సాగరపల్లి, చిన్నబుర్రతోగూ, పెద్దబుర్రతోగూ, భూదేవిపేటలలో పర్యటించిన ఎమ్మెల్యే బాలరాజు, అనంతరం కటుకూరు సచివాలయం పరిధిలో యడవల్లి గ్రామం, తిరుమలదేవి సచివాలయం పరిధిలో కన్నాయి గుట్ట గ్రామాలలో పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి అక్క,చెల్లమలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. నేడు రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు దూసుకువెళుతుందంటే సీఎం వైఎస్ జగన్ దూర దృష్టే కారణమన్నారు. ఆయన ఒక పక్క సంక్షేమం అందిస్తూనే, మరో పక్క రాష్ట్రాభివృద్ధికి కావాల్సిన అన్ని చర్యలు తీసుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని గుర్తించి, రాబోయే రోజుల్లో సంక్షేమం, అభివృద్ధి నిరంతరాయంగా కొనసాగేలా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేసుకుందామని బాలరాజు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వల్ల లక్ష్మి, జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు కేసగాని శ్రీనివాస్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కామినేని వెంకటేశ్వరరావు, గుద్దేటి భాస్కర్, సర్పంచ్‌లు కట్టి ఉదయ్‌కిరణ్, లక్ష్మణ్, కె.సత్తిరాజు, ఎస్‌కే షౌకత్ హుస్సేన్, వార్డు మెంబర్లు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పశువుల పట్టివేత



పోలవరం రూరల్: అక్రమంగా ఆవులను తరలిస్తున్న లారీని పోలవరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం కిలారిపోతు నారాయణవలస గ్రామంలో 9 ఆవులను, ఒక గిత్తదూడను తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలోని కబేళాలో అప్పగించాలని లారీ యజమాని జి.రమేష్ పురమాయించినట్లు డ్రైవర్ ఎం.సంతోష్ కుమార్ తెలిపాడన్నారు. బుధవారం రాత్రి పశువులతో బయలుదేరిన లారీ కన్నాపురం మీదుగా ఖమ్మం వెళుతుండగా, తమకు సమాచారం అందిందని, దీంతో పట్టిసీమ వద్ద పట్టుకుని లారీని సీజ్ చేసినట్లు ఎస్సై చెప్పారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా
- తడికలపూడిలో గడపగడపకు మన ప్రభుత్వం



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా

కామవరపుకోట: పేదల అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. గురువారం తడికలపూడి గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు వివరిస్తూ, లబ్ధిదారులకు బ్రోచర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తూ, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. పేదలకు కార్పొరేట్ వైద్య, విద్య అందించాలనే ఉద్దేశంతో విద్యా వైద్య రంగాలకు పెద్దపీట వేశారన్నారు. నవరత్నాలను తీసుకొచ్చి ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. దీనితో పేదల సంక్షేమాన్ని, అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష టీడీపీ నాయకులు, వారి మిత్ర నాయకులు కలిసి ప్రభుత్వంపై బురద జల్లుతున్నాయన్నారు. ఎంతమంది కలిసి వచ్చినా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175 సీట్లు గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడతా రమేష్ బాబు, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పండు జగదీష్, సచివాలయ కన్వీనర్ వెర్రి శ్రీను, చింతలపూడి ఏఎంసీ డైరెక్టర్ బోట్ల లక్షణరావు, పొద్దుటూరు పండు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు వలంటీర్లు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ డాక్టర్ వంటిపల్లి విజయకృష్ణ

కామవరపుకోట.: విద్యార్థి స్థాయి నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, జిల్లా విజిలెన్స్ కమిటీ డైరెక్టర్ డాక్టర్ వంటిపల్లి విజయకృష్ణ అన్నారు. గురువారం ఈస్ట్ యడవల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయురాలు అనంతలక్ష్మి అధ్యక్షతన చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకృష్ణ మాట్లాడుతూ విద్యార్థి స్థాయి నుంచే ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. నిత్య జీవితంలో వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటిని వినియోగదారుల హక్కుల చట్టం ద్వారా ఏ విధంగా పరిష్కరించుకోవాలి, వినియోగదారుల కమిషన్లు వాటి పనితీరు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈనెల 18వ తేదీ నుంచి పాఠశాలలో వినియోగదారుల దినోత్సవం సందర్భంగా వారోత్సవాలు నిర్వహించనున్నామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ రాగాని లక్ష్మీకాంతం, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం



సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక ఛత్రపతి శివాజీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డా. ప్రసాద్‌బాబు అధ్యక్షతన కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ ఎన్.ఎస్.ఎస్. యూనిట్ -1, ఎన్.ఎస్.ఎస్. యూనిట్ -2 ఆధ్వర్యంలో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌బాబు మాట్లాడుతూ ఇటీవల కాలంలో చాలామంది రక్తహీనతతో బాధపడుతున్నారని, డెంగీ రావడం వల్ల రక్త కణాలు తగ్గి చాలా మందికి రక్తం అవసరం అవుతుందన్నారు. సేవా దృక్పథంతో తమ కళాశాలలో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. మొత్తం 32 మంది కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ వి.హనుమంతరావు, ఇండియన్ రెడ్ క్రాస్ నుంచి ఏలూరు జిల్లా పీఆర్ఓ కె.వెంకటరమణ, రెడ్ క్రాస్ సిబ్బంది సీహెచ్ శైలజ, పి.సునీల్, కె.ప్రమీల, కె.శశికళ, ఎండీ సుధీర్, పి.రంగమ్మ, కె.శ్రీనివాస్ తదితరులు సేవలు అందించారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ నూతన ఆలయ శంకుస్థాపన కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9.35 గంటలకు బ్రహ్మశ్రీ మామిళ్ళపల్లి శివానందాచార్యుల పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించగా పాలకమండలి కమిటీ చైర్మన్ మంతెన సోమరాజు, ఉమాదేవి దంపతులు శాస్త్రోక్తంగా శంకుస్థాపన పూజలు చేశారు. అనంతరం భక్తులు నవరత్న నవధాన్యాలతో పూజలలో పాల్గొన్నారు. సుమారు రూ.40 లక్షల దాతల విరాళాలతోపాటు శ్రీవాణి(టీటీడీ) ట్రస్ట్ మంజూరు చేసే నిధుల ద్వారా నూతన ఆలయ నిర్మాణాన్ని ప్రారంభించినట్లు సోమరాజు తెలిపారు. 2024 ఉగాది నాటికి ఆలయ నిర్మాణం పూర్తి చేయాలనే సంకల్పంతో ఉన్నామన్నారు. ప్రస్తుతానికి అమ్మవారిని బాలాలయంలో నెలకొల్పి నిత్య పూజాది కైంకర్యాలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు సుబ్రహ్మణ్య శర్మ చెప్పారు.

ఎమ్మెల్యే పరామర్శ



కటుకూరులో ఆనందరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

వేలేరుపాడు: పేదల ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని, ఆపద వస్తే ఆదుకునేందుకు నేనున్నానంటూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అభయ హస్తం అందిస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. గురువారం మండలంలోని కటుకూరు సచివాలయం పరిధిలో ఇటీవలే మరణించిన వల్లి ఆనంద్ రావు కుటుంబాన్ని ఎమ్మెల్యే బాలరాజు పరామర్శించారు. ఆనందరావు చిత్రపటానికి పూలమాలలు వేసి, అతని భార్యకు రూ.10 వేలు అందజేశారు. ఆనందరావు కుటుంబానికి పార్టీ అన్నివిధాలుగా అండగా ఉంటుంది హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు సచివాలయ కన్వీనర్‌లు, గృహసారథులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజుకు తపాలా ఉద్యోగుల సమ్మె

జంగారెడ్డిగూడెం: ఆల్ ఇండియా గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మె గురువారం మూడో రోజు కొనసాగింది. కమలేష్ చంద్ర కమిటీ ఇచ్చిన సిఫార్సులను నేటివరకు కేంద్ర ప్రభుత్వం అమలు పరచలేని కారణంగా దేశంలో ఉన్న గ్రామీణ తపాల ఉద్యోగులందరూ సమ్మెలో పాల్గొనడం జరిగిందని నాయకులు తెలిపారు. ప్రభుత్వం తమ డిమాండ్స్ ఒప్పుకునే వరకు నిరవధిక సమ్మె నిరంతరంగా కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఏలూరు డివిజన్ ఏఐజీడీఎస్‌యూ యూనియన్ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు, కార్యదర్శి ఎస్ఎస్ బాజీ, వైస్ ప్రెసిడెంట్ వి.డేవిడ్‌రాజు, అసిస్టెంట్ సెక్రెటరీ దుర్గారావు, కోశాధికారి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు



శివపురం సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాల డిస్‌ప్లేను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

చింతలపూడి: ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా ప్రజలకు అందజేస్తున్నట్లు ఈఓపీఆర్‌డీ విక్టర్‌బాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో భాగంగా శివపురం సచివాలయం పరిధిలో గురువారం పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో నేరుగా సంక్షేమ పథకాల లబ్ధి చేరుతున్నట్లు చెప్పారు. గత నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ లబ్ధిని వివరించడమే కార్యక్రమం ఉద్దేశ్యమన్నారు. తొలుత పార్టీ జెండాను వైఎస్సార్ సీపీ నాయకులు ఆవిష్కరించి సంక్షేమ పథకాల డిస్‌ప్లేను ప్రారంభించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ పి.మారేష్, సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధే జగనన్న లక్ష్యం



సంక్షేమ పథకాల డిస్‌ప్లే ఆవిష్కరిస్తున్న నాయకులు

కామవరపుకోట: రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని జెడ్పీటీసీ కడిమి రమేష్ అన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడత రమేష్ బాబు ఆధ్వర్యంలో గురువారం కొండగూడెం గ్రామ సచివాలయం పరిధిలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఎగరవేసి, సంక్షేమ పథకాల డిస్‌ప్లేను ఆవిష్కరించారు. అనంతరం గ్రామస్తులకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు వివరిస్తూ, మా నమ్మకం నువ్వే జగన్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో కామవరపుకోట సర్పంచ్ కరిపోతు అనూష, ఉపసర్పంచ్ మేడూరు రంగబాబు, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పండు జగదీష్, రాష్ట్ర ముదిరాజ్ సంఘ డైరెక్టర్ చిక్కుళ్ళ శ్రీను సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన



తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలతో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీఓ అద్దయ్య

బుట్టాయగూడెం: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఈవీఎంలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం ఆర్‌డీఓ అద్దయ్య నాయకులకు ఓటు వేసే విధానంపై అవగాహన కలిగించారు. అలాగే సందేహాలు ఉన్నవారు నివృత్తి చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం ఆర్‌డీఓ మాట్లాడుతూ సమగ్రమైన ఓటర్‌లిస్ట్ తయారు చేసే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. ప్ర తి బూత్ స్థాయిలో ఉన్న ఓటరు వివరాలను సమగ్రంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. తొలుత రాజకీయ నాయకులతో ఓటర్ల జాబితా తయారీపై అవగాహన కలిగించారు. అలాగే బీఎల్ఓలతో సమావేశం నిర్వహించి ఓటర్ లిస్ట్‌ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌లు ఎస్.శారాశాంతి, బి.సుమతి, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నూతనోత్తేజానికి రోటరీ క్లబ్ కృషి

కొయ్యలగూడెం: హైస్కూల్ స్థాయి విద్యార్థులలో నూతన ఉత్తేజానికి రోటరీ క్లబ్ కృషి చేస్తుందని అందుకు న్యూ జనరేషన్ ప్రోగ్రామ్ ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు కొయ్యలగూడెం రోటరీ క్లబ్ పేర్కొంది. గురువారం ప్రభుత్వ బాలుర హైస్కూల్లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో న్యూ జనరేషన్ కార్యక్రమం అవగాహన శిబిరం నిర్వహించారు. విశ్వనాథ శర్మ, బొలిశెట్టి వాసు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రభుత్వ హై స్కూల్స్ విద్యార్థులతోపాటు ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు వెయ్యి మందికి పైగా పాల్గొన్నారు. విద్యార్థులు చదువులో సృజనాత్మకత శక్తి పెంపొందించుకునేందుకు, క్రీడలలో రాణించేందుకు న్యూ జనరేషన్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.రోటేరియన్స్ అసిస్టెంట్ గవర్నర్ బోడిపిండి సుబ్రహ్మణ్యం, మద్దు గోపి, మాటూరి రాధాకృష్ణ, ఎంవీ ప్రభాకర్, బి.పాపారావు, గద్దె మోహనరావు, చిరువూరి సాయిప్రకాష్, దారం సత్తిరాజు, అడపా సత్యనారాయణ, ఐవీ అప్పారావు, మజ్జి సూరిబాబు, పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు సిబ్బంది నియామకం

జంగారెడ్డిగూడెం రూరల్: అంగన్‌వాడీ సిబ్బంది సమ్మెలో ఉన్నందున అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణకు ఏవిధమైన ఆటంకాలు కలగకుండా సిబ్బందిని నియమించేందుకు ఉత్తర్వులు జారీ అయ్యాయని ఎంపీడీవో కె.విజయ్‌ప్రసాద్ తెలిపారు. నూతన సిబ్బంది ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విధులు నిర్వహించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచి ఫొటోలను నవశకం గ్రూప్‌లో పోస్టు చేయాలన్నారు. వంట చేసేందుకు ఒక్కో సెంటర్‌కు స్వయం సహాయక సభ్యులు, ఇద్దరు వలంటీర్లను నియమించడం జరిగిందన్నారు. ఈ ఉత్తర్వులు అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె విరమించే వరకు అమలులో ఉంటాయన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మెట్టపై ఉన్న 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహిస్తున్న కారణంగా ఈనెల 15వ తేదీన జంగారెడ్డిగూడెం పట్టణ సబ్‌స్టేషన్‌లు, తాడువాయి సెక్షన్ పరిధిలోని అన్ని సబ్‌స్టేషన్‌లు, జీలుగుమిల్లి, కుకునూరు, వేలేరుపాడు మండలాల్లో అన్ని సబ్‌స్టేసన్‌లకు విద్యుత్ సరఫరాలో అంతరాయలు ఏర్పడుతాయని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయాలు కలుగుతాయని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

చిన్నారులకు పౌష్టికాహారం

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలో ఉన్న 55 అంగన్‌వాడీ కేంద్రాలలో సచివాలయ సిబ్బంది ద్వారా చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించామని ఎంపీడీవో కె.విజయ్‌ప్రసాద్ తెలిపారు. పుట్లగట్లగూడెం. దేవులపల్లి గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీవో పరిశీలించారు. పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ దోరేపల్లి సత్యనారాయణ, వామిశెట్టి పావని తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఆర్థిక సాయం



అగ్నిప్రమాద బాధితులకు సాయం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కొయ్యలగూడెం: అచ్యుతాపురం గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీరంగపట్నం గ్రామంలో అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా నిలిచింది. అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన మానికల వెంకటలక్ష్మి, నాగేశ్వరరావు కుటుంబాన్ని పార్టీ నాయకులు గురువారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.7 వేలు విలువైన నిత్యావసర సరుకులు, రూ.9 వేలు బాధిత అందజేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, ఎంపీపీ గంజిమాల రామారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు మంతెన సోమరాజు, మాజీ ఎంపీపీ మట్టా సత్తిపండు, మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, సర్పంచ్ మద్దిపాటి నాగమణి, ఎంపీటీసీ మండపాటి కుమారి, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్, గుడుచుట్టు సత్యనారాయణ, ముమ్మడి గోపి తదితరులు ఆర్థిక సహాయం అందజేసిన వారిలో ఉన్నారు.

నేడు వరుడు కానున్న సుబ్రహ్మణ్యేశ్వరుడు



ఆలయంలో కొలువైన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్ర ఉపాలయమైన శ్రీ వల్లీదేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయం షష్టి వేడుకలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 15 నుంచి 21 వరకు స్వామివారి దివ్య కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. అందులో భాగంగా శుక్రవారం ఉదయం అర్చకులు, పండితులు స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా చేయనున్నారు. ఈ వేడుకలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు కోరారు.

పారిజాతగిరిలో ధనుర్మాస ఉత్సవాలు



జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానములో ఈనెల 17వ తేదీ నుంచి 20204 జనవరి 14వ తేదీ వరకు నెలరోజుల పాటు ధనుర్మాస ఉత్సవములు నిర్వహించనున్నామని కార్యనిర్వహణ అధికారి మానికల రాంబాబు తెలియచేశారు. ఈ నెల రోజులు వేకువ జామునే గోదాదేవికి విశేష పూజలు, తిరుప్పావై సేవా కాలము, తీర్థ ప్రసాద గోష్టి మొదలగు కార్యక్రమాలు ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా డిసెంబర్ 23న వైకుంఠ ఏకాదశిన (ముక్కోటి), జనవరి 9న దీపోత్సవం, 12న కూడారై ఉత్సవము, 14న భోగి పండగ రోజున గోదా కల్యాణం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.